
సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం । 26 । జనవరి । 2023



మద్దిలో కల్యాణం

జంగారెడ్డిగూడెం రూరల్: మద్ది ఆంజనేయ క్షేత్రంలో స్వామివారి జన్మ నక్షత్రం సందర్భంగా బుధవారం సువర్చలా హనుమద్ కల్యాణ్యాన్ని నేత్రపర్వంగా జరిపించారు.



హుండీ ఆదాయం లెక్కింపు

జంగారెడ్డిగూడెం: గోకులతిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీల ఆదాయం లెక్కించారు. 94 రోజులకు రూ.11,43,257 ఆదాయం లభించింది.



మంగళ హారతులు

పెనుగొండ: వాసవీ శాంతి థాంలో నాల్గో ప్రతిష్ఠాపన మహోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ద్వాదశ జ్యోతిర్లింగాలకు మంగళ హారతులు ఇచ్చారు.





● సర్వం సిద్ధం

భీమవరం కలెక్టరేట్ ఆవరణలో జరిగే గణతంత్ర దినోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. బుధవారం పోలీస్ బలగాలు, హోమ్‌గార్డ్స్, ఎన్‌సీసీ విభాగాలు, 6 ప్లాటూన్లు నిర్వహించిన కవాతు రిహార్సల్‌ను డీఎస్పీ బండారు శ్రీనాథ్‌తో కలిసి ఎస్పీ రవిప్రకాష్ పరిశీలించారు. గ్యాలరీలు, స్టాల్స్, శకటాల ప్రదర్శన ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు సూచనలు ఇచ్చారు. కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

- సాక్షి, భీమవరం

న్యూస్‌రీల్

ఆక్వా అభివృద్ధికి సానుకూల స్పందన



సీఎం జగన్‌తో వడ్డి రఘురామ్‌నాయుడు

తాడేపల్లిగూడెం (టీఓసీ): రాష్ట్రంలో ఆక్వా రంగం అభివృద్ధిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని ఏపీ ఆక్వా డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వైస్ చైర్మన్, తాడేపల్లిగూడేనికి చెందిన వడ్డి రఘురామ్‌నాయుడు తెలిపారు. తాడేపల్లిలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో సీఎం జగన్ ఆక్వా రంగంపై బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారన్నారు. ఆక్వా రంగంలో సీడ్, ఫీడ్, ప్రాసెసింగ్ ప్లాంట్లు, రొయ్య కొనుగోలు తదితర అంశాలపై చర్చించారన్నారు. మత్స్య శాఖ మంత్రి సిదిరి అప్పలరాజు, మత్స్యశాఖ కమిషనర్ కన్నబాబు తదితరులు పాల్గొన్నారని రఘురామ్‌నాయుడు తెలిపారు.

27న ఈపీఎఫ్ఓ ఔట్ రీచ్ కార్యక్రమం

సాక్షి, భీమవరం: ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) ఆధ్వర్యంలో ఈనెల 27న ఉదయం 9 గంటలకు భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నిధి ఆప్‌కే నికట్ జిల్లా ఔట్ రీచ్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు పీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ వైడీ శ్రీనివాస్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నిధి ఆప్‌కే నికట్ నేపథ్యంలో అనారోగ్యం, వివాహాలు, గృహనిర్మాణం, విద్య వంటి వాటికి అడ్వాన్స్‌ల కోసం ఈపీఎఫ్ సభ్యులు, పింఛన్‌దారులు, సంస్థలు ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని శ్రీనివాస్ కోరారు.

మద్ది ఆదాయం రూ.35.96 లక్షలు



ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి దేవస్థానంలో హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. 35 రోజులకు రూ.35,96,467 ఆదాయం లభించినట్టు ఈఓ ఆకుల కొండలరావు తెలిపారు. దేవాదాయ శాఖ తనిఖీదారు (తాడేపల్లిగూడెం) ఎ.సుజన్ పర్యవేక్షణలో లెక్కింపు జరిగింది.

విద్యుత్ శాఖ అధికారులకు గణతంత్ర అవార్డులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): గణతంత్ర దినోత్సవం సందర్భంగా విద్యుత్ రంగంలో విశేష సేవలు చేసిన అధికారులు, సిబ్బందికి ఆ శాఖ అవార్డులు ప్రకటించింది. ఈపీడీసీఎల్ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ పరిధిలో ఏలూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.శశిధర్, తాడేపల్లిగూడెం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎ.ఉమామహేశ్వరరావు, ఏలూరు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎల్‌వీ శ్రీనివాసరావును అవార్డులకు ఎంపిక చేశారు. వీరితో పాటు ఏలూరు టౌన్ ఈఆర్ఓలో పనిచేస్తున్న అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ పి.శ్రీదేవి, కుక్కునూరు లైన్‌ఇన్‌స్పెక్టర్ వి.రమేష్, చివటం జూనియర్ లైన్‌మెన్ ఎం.రమేష్, ఏలూరు విద్యుత్ విజిలెన్స్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ మోహనరావు పురస్కారాలకు ఎంపికయ్యారు.

జేఈఈ మెయిన్స్‌కు 1,064 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని కేంద్రాల్లో బుధవారం జేఈఈ మెయిన్స్ పరీక్షలకు 1,064 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఏలూరు సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 144 మందికి 144 మంది, మధ్యాహ్నం 144 మందికి 143 మంది హాజరయ్యారు. తాడేపల్లిగూడెం వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 220 మందికి 218 మంది, మధ్యాహ్నం 177 మందికి 174 మంది, తాడేపల్లిగూడెం శశి ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 99 మందికి 96 మంది, మధ్యాహ్నం 90 మందికి 90 మంది హాజరయ్యారు. భీమవరం డీఎన్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 100 మందికి 100 మంది, మధ్యాహ్నం 100 మందికి 99 మంది హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఏలూరు సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కె.వెంకటేశ్వరరావు, ఏలూరు సిటీ కో–ఆర్డినేటర్ వైఎస్ఎస్ చంద్రశేఖర్ తెలిపారు.

పారదర్శకం.. చదువుకు పట్టం

- ఏపీఎంలకు విద్యారంగ పథకాల అమలు బాధ్యత
- ఉపాధ్యాయులకు ఉపశమనం
- మండలానికో ఏపీఎం పర్యవేక్షణ
- సెర్ప్ నుంచి నియామకం



జగనన్న గోరుముద్దను ఆస్వాదిస్తున్న విద్యార్థులు

పాఠశాలలు.. విద్యార్థులు			
ఏలూరు జిల్లా		పశ్చిమగోదావరి జిల్లా	
ప్రాథమిక	1,306	ప్రాథమిక	1,069
ప్రాథమికోన్నత	201	ప్రాథమికోన్నత	84
ఉన్నత	246	ఉన్నత	206
మొత్తం	1,753	మొత్తం	1,359
బాలురు	70,992	బాలురు	57,130
బాలికలు	70,760	బాలికలు	60,122
మొత్తం	1,41,752	మొత్తం	1,17,252

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలో విద్యారంగ అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాలకు నాణ్యతతో కూడిన విద్యను అందిస్తోంది. ఇందుకు పలు పథకాలను అమలుచేస్తోంది. అయితే వీటి పర్యవేక్షణకు ఉపాధ్యాయులను భాగస్వాములను చేయడంతో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలపై ప్రభావం చూపుతోంది. దీంతో ఉపాధ్యాయులను కేవలం బోధనకే పరిమితం చేసి సంక్షేమ పథకాల అమలుకు ఇతరులను వినియోగించాలని భావించి సరికొత్త నిర్ణయం తీసుకుంది. పథకాల పర్యవేక్షణకు మండల స్థాయిలో ప్రత్యేక వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చింది. డీఆర్‌డీఏలో సెర్ప్ విభాగం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్లకు (ఏపీఎం) ఈ వ్యవస్థలోని పర్యవేక్షణ బాధ్యత ఇస్తూ ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మండలానికి ఒకరు ఉన్న ఏపీఎంలకు వారి విధివిధానాలపై శిక్షణ ఇస్తూ కొత్త బాధ్యతలు అప్పగించింది. మండల విద్యాశాఖాధికారి సమన్వయంతో విద్యాశాఖలో వారి విధులను నిర్దేశించింది.

విద్యాశాఖ, సెర్ప్ సమన్వయంతో..

విద్యారంగంలోని పథకాల అమలులో డీవైఈఓలు లేదా ఎంఈఓలకు ఏపీఎంలు సహకరిస్తారు. నోట్ బుక్‌లు, పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫారంల పంపిణీతో పాటు స్కాలర్‌షిప్‌లు, ధ్రువీకరణ పత్రాల జారీలో సహకరిస్తారు. దీంతో మండల విద్యాశాఖ, డిప్యూటీ విద్యాశాఖ అధికారులకు, ఉపాధ్యాయులకు పని ఒత్తిడి తగ్గుతుంది. ఇక నుంచి వారు అకడమిక్, ఇతర నిర్వాహక వ్యవహారాలను మాత్రమే పర్యవేక్షిస్తారు. ప్రభుత్వ పథకాలు అందుతున్న ప్రతి పాఠశాలను ఏపీఎంలు పర్యవేక్షించాల్సి ఉంది. ఇలా పథకాలను పారదర్శకంగా అందించడంతో పాటు చదువులకు పట్టం కట్టేలా ప్రభుత్వం ఈ విధానాన్ని అమలులోకి తీసుకువచ్చింది.

ఏపీఎంల బాధ్యతలు

- గ్రామ/వార్డు సచివాలయం స్థాయిలో బడి బయట ఉన్న విద్యార్థులను పాఠశాలలకు పంపించాలి.
- జగనన్న అమ్మఒడి పథకం కోసం అర్హులైన తల్లులను గుర్తించాలి.
- పాఠశాలలో విద్య, వైద్య, రక్షణకు సంబంధించిన అంశాలను రోజువారీ పర్యవేక్షించాలి.
- ఉపాధ్యాయుల జీతాలు, సెలవుల మంజూరు, ట్రెజరీ పనులు, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయిలో నిర్వహించే సమీక్షా సమావేశాలకు హాజరు వంటి ప్రధాన బాధ్యతలను సకాలంలో పూర్తిచేయాలి.
- జగనన్న గోరుముద్ద పథకం అమలులో బియ్యం, గుడ్లు, చిక్కీ సరఫరా, ఆహారం నిల్వలో శుభ్రత, భోజన ప్రాంతం, తాగునీరు తదితర అంశాలపై పర్యవేక్షణలో డీవైఈఓ, ఎంఈఓలకు సహాయం అందించాలి.
- మరుగుదొడ్ల నిర్వహణ నిధి కార్యకలాపాల పథకాన్ని పర్యవేక్షించాలి.
- ఐఎంఎంఎస్ యాప్, మరుగుదొడ్ల నిర్వహణ, ఆయా రిజిస్ట్రేషన్, ఆయా హాజరు, ఆయాలకు తక్షణమే చెల్లింపులు తదితర విషయాల్లో అప్‌డేషన్‌ను నిర్ధారించాలి.
- స్కూల్ పరిధిలోని డిజిట్ పరికరాలు, ఇంటర్నెట్, భద్రతా నిర్వహణ చేపడటంతో పాటు వాటిని పర్యవేక్షించాలి.
- స్వాతంత్ర్య, గణతంత్ర, ఉపాధ్యాయ, బాలల దినోత్సవాల నిర్వహణ, విద్యావారం, జాతీయ పండగల నిర్వాహణకు ఉపాధ్యాయుల పని తగ్గిస్తూ విద్యాశాఖ అధికారులతో సమన్వయంగా పనిచేయాలి.

పాఠశాల స్థాయిలో..

మనబడి నాడు–నేడు, జగనన్న అమ్మఒడి, జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద, రోజువారీ మరుగుదొడ్ల శుభ్రత, పాఠశాల సక్రమ నిర్వహణ కోసం బడ్జెట్ కేటాయింపు, నీతి ఆయోగ్, సీఎస్ఆర్ ద్వారా మౌలిక వనరుల కల్పన, విద్యా ప్రమాణాల పెంపు కోసం నూతన జాతీయ విద్యావిధానం ద్వారా పాఠశాల మార్పు, ఉపాధ్యాయులకు శిక్షణ, విద్యార్థులకు ఆన్‌లైన్ పాఠాలు, డిజిటల్ పాఠాలు అందించడం, తరల్, సాల్ట్, లిప్, సిప్, దీక్షా, జోలీ ఫోనిక్స్ వంటి పలురకాల కార్యక్రమాలను ఏపీఎంలు పర్యవేక్షించాల్సి ఉంటుంది.

పథకాల అమలుకు రాచబాట



విద్యారంగంలో పథకాలు పారదర్శకంగా, అర్హులందరికీ సక్రమంగా అందించడానికి ఏపీఎంల వ్యవస్థ బాగా ఉపయోగపడుతుంది. ఉపాధ్యాయులు కేవలం బోధనపై దృష్టి కేంద్రీకరించడానికి తద్వారా ఉత్తమ ఫలితాలు సాధించడానికి ఈ వ్యవస్థ కీలకంగా పనిచేయనుంది. సెర్ప్ నుంచి పర్యవేక్షణ బాధ్యత ఏపీఎంలకు అదనంగా అప్పగించడం వల్ల ఉపాధ్యాయులు, ఎంఈఓలు, డిప్యూటీ ఈఓలకు పనిభారం తగ్గుతుంది.

– జీజేప స్టీఫెన్, వైఎస్ఆర్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు

కలెక్టర్ ప్రశాంతికి పురస్కారం



విజయవాడలో గవర్నర్ హరిచందన్ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం(ప్రకాశం చౌక్): విజయవాడలోని తుమ్మలపల్లి కళాకేంద్రంలో బుధవారం జరిగిన 13వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ చేతులమీదుగా కలెక్టర్ పి.ప్రశాంతి రాష్ట్రస్థాయి బెస్ట్ ఎలక్ట్రోలర్ ప్రాక్టీస్ అవార్డును అందుకున్నారు. ఓటరు చైతన్య కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేయడం, అత్యధిక ఓటర్ల నమోదు, చనిపోయిన వారి ఓట్ల తొలగింపునకు సంబంధించి రాష్ట్రంలో ముగ్గురు కలెక్టర్లకు అవార్డులు ప్రకటించగా వారిలో ప్రశాంతి ఒకరు. అవార్డు అందుకున్న కలెక్టర్ ప్రశాంతికి జిల్లా ఉద్యోగులు, ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.

హెచ్‌ఎంపై అట్రాసిటీ కేసు

భీమవరం అర్బన్: దళిత మహిళను కులం పేరుతో దూషించిన ఫిర్యాదు మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిపై భీమవరం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గూట్లపాడు గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో సంధి లక్ష్మీప్రసన్న అంగన్‌వాడీ కార్యకర్తగా పని చేస్తుండగా అదే కాంపౌండ్‌లో ప్రధానోపాధ్యాయురాలిగా బి.శివనాగజ్యోతి విధులు నిర్వహిస్తున్నారు. గతేడాది డిసెంబర్ 31న హెచ్‌ఎం శివనాగజ్యోతి పాలు వేడిచేయమని అడగ్గా లక్ష్మీప్రసన్న లేవు అని బదులిచ్చింది. దీంతో ఆగ్రహించిన శివనాగజ్యోతి కులంపేరుతో లక్ష్మీ ప్రసన్నను దూషించడంతో పాటు సెల్‌ఫోన్ లాక్కుని, జుట్టు పట్టుకుని బల్లకేసి కొట్టిగాయ పరిచినట్టు బాధితురాలు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు భీమవరం రూరల్ పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఉమా మహేశ్వరరావు ఎస్సీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు కీలకం

జాయింట్ కలెక్టర్ మురళి



మోటార్ సైకిల్ ర్యాలీలో జేసీ మురళి

సాక్షి, భీమవరం: ప్రజాస్వామ్యంలో ఓటు కీలకమని జిల్లా జాయింట్ కలెక్టర్ జేవీ మురళి అన్నారు. 13వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా బుధవారం పట్టణంలోని బీవీ రాజు కళాశాల వద్ద మోటార్ సైకిల్ ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఓటర్ల భాగస్వామ్యం పెంపొందించడమే జాతీయ ఓటర్ల దినోత్సవం ప్రధాన లక్ష్యమన్నారు. ఓటు ద్వారా దేశాన్ని ఉన్నతస్థాయిలో నిలపగల వారిని ఎన్నుకోవాలన్నారు. ఓటును అమ్ముకోవద్దని, ఇది భవితకు తొలిమెట్టు అన్నారు. మేధావులంతా ఓటు వేయాలని కోరారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం దివ్యాంగులు, సీనియర్ ఓటర్లు, ట్రాన్స్‌జెండర్లు, కొత్తగా ఓటరుగా నమోదైన వారిని, ఉత్తమ వీఆర్వోలను జాయింట్ కలెక్టర్ మురళి సత్కరించారు. డీఆర్వో దాసి రాజు, కళాశాల ప్రిన్సిపాల్ ఆర్‌కే రాజు, తహసీల్దార్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తిగా ఉమాసునంద

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తిగా ఎస్.ఉమాసునంద నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం హైకోర్టు రిజిస్ట్రార్ ఉత్తర్వులను జారీ చేశారు. ప్రస్తుతం ఉమాసునంద ల్యాండ్ రిఫార్మ్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్ చైర్మన్‌గా, రెండో అడిషనల్ జిల్లా జడ్జిగా ఏలూరులో పనిచేస్తున్నారు. తాజాగా పదోన్నతిపై ఆమెను పోక్సో కోర్టుకు బదిలీ చేశారు. ప్రస్తుతం పనిచేస్తున్న కోర్టులో పూర్తి అదనపు బాధ్యతలు కూడా నిర్వహించనున్నారు.

ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాజేశ్వరి

ఏలూరు (టూటౌన్): ఖైదీలకు, వారి కుటుంబ సభ్యులకు న్యాయ సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ తరఫున ఉచిత న్యాయ సహాయం అందిస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్ ఆధ్వర్యంలో కోటదిబ్బలోని జిల్లా జైలును బుధవారం ఆమె సందర్శించారు. జైలులో అందిస్తున్న సౌకర్యాలు, వైద్య సదుపాయాలపై ఖైదీలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. అర్హులైన వారికి న్యాయవాదిని నియమించి వారి పక్షాన వాదిస్తామన్నారు. అనంతరం శనివారపుపేటలోని బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేశారు. పిల్లలకు పరిశుభ్రమైన పోషకాహారాన్ని అందించాలని, ఈ విషయంలో ఎటువంటి రాజీ పడొద్దని అధికారులకు సూచించారు. జిల్లా సూపరింటెండెంట్ సీహెచ్ఆర్‌వీ స్వామి, జైలర్లు వెంకటరెడ్డి, శ్రీనివాసరావు, బాలుర వసతి గృహం సూపరింటెండెంట్ మురళీధర్ ఉన్నారు.

వచ్చేనెలలో రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు

నూజివీడు: నూజివీడులోని విక్టోరియా టౌన్‌హాల్ గ్రౌండ్ ఆవరణలో వచ్చేనెల 3, 4, 5వ తేదీల్లో 66వ ఏపీ రాష్ట్ర స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్–14 బాలబాలికల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్‌ను నిర్వహించనున్నట్టు ఏలూరు జిల్లా ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డీబీ రాజేంద్రప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే బాలురు, బాలికల రాష్ట్ర జట్లను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

పుంజుకుంటున్న పర్యాటకం

దెందులూరు: రాష్ట్రంలో పర్యాటక రంగం క్రమేపి పుంజుకుంటోందని, జిల్లాలోని పలు ప్రాంతాలు పర్యాటకులను ఆకర్షిస్తున్నాయని సెట్‌వెల్ సీఈఓ పట్టాభి రామన్న అన్నారు. వేగవరంలో ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం జాతీయ పర్యాటక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పర్యాటక ప్రాంతాలను సందర్శిస్తే మానసిక ప్రశాంతతతో పాటు చదువుపై ఏకాగ్రత పెరుగుతుందన్నారు. జిల్లాలో కొల్లేరులోని ఆటపాక, బౌద్ధారామాలు, పాపికొండలు వంటివి పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చెందుతున్నాయన్నారు. జిల్లా నెహ్రూ యువజన యూత్ ఆఫీసర్ కిషోర్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రకృతిని ప్రేమించాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ రాధాకృష్ణ, ఏఓ టీఎస్ కరుణానిధి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

లారీ ఢీకొని వ్యక్తి మృతి

మామిడికుదురు : పాశర్లపూడి కొండాలమ్మచింత సెంటర్ సమీపంలో 216వ నంబర్ జాతీయ రహదారిపై లారీ ఢీకొని పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం చిన్నపాలెం గ్రామానికి చెందిన మల్లుల శ్రీనివాసు (48) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని కుమారుడు వినయ్ ఫిర్యాదు మేరకు దీనిపై కేసు నమోదు చేశామని నగరం ఎస్సై షేక్ జానీబాషా బుధవారం తెలిపారు. పని ముగించుకుని అమలాపురం నుంచి ఇంటికి వెళుతున్న శ్రీనివాసును వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టిందన్నారు. శ్రీనివాసు మృతదేహాన్ని రాజోలు ప్రభుత్వాస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి, లారీడ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

బాలికను మోసగించిన యువకుడిపై కేసు నమోదు

పెనుగొండ: పెళ్లి చేసుకుంటానని నమ్మించి వివాహేతర సంబంధం ఏర్పరుచుకుని ముఖం చాటేసిన ఓ యువకుడిపై బాలిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆచంట ఎస్సై బీఎస్‌డీఆర్ ప్రసాద్ చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. భీమలాపురం గ్రామానికి చెందిన సన్నిధి రవిప్రకాష్ ఇంట్లో వల్లూరు గ్రామానికి చెందిన ఓ బాలిక పనిచేస్తోంది. బాలికను పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి రవిప్రకాష్ ఆమెతో వివాహేతర సంబంధం ఏర్పరుచుకున్నాడు. దీంతో బాలిక పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేయడంతో ముఖం చాటేశాడు. విషయాన్ని బాలిక తన తల్లిదండ్రులకు చెప్పగా, వారి సాయంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్పీ యూ.రవిప్రకాష్, డీఎస్పీ కె.రవిమనోహరచారి బుధవారం గ్రామానికి వెళ్లి బాధితురాలి నుంచి వివరాలు సేకరించారు.

శరవేగంగా వైద్య కళాశాల నిర్మాణం

ప్రభుత్వ మెడికల్ కళాశాల.. ఏలూరు జిల్లా వాసుల చిరకాల కోరిక. దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ హయాంలో ఏలూరు జిల్లా ఆసుపత్రి స్థాయి నుంచి స్పెషాలిటీ హాస్పిటల్‌గా అప్‌గ్రేడ్ అయింది. దీంతో ఐదొందలకు పైగా బెడ్స్, ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఏలూరుకు ప్రభుత్వ మెడికల్ కాలేజీ మంజూరు చేశారు. సుమారుగా రూ.525 కోట్ల వ్యయంతో మెడికల్ కళాశాల, బోధనాసుపత్రి ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నాటికి 150 సీట్లతో మెడికల్ కళాశాల తరగతులు ప్రారంభించడమే లక్ష్యంగా యుద్ధప్రాతిపదికన భవన నిర్మాణాలు జరుగుతున్నాయి. ఓ వైపు ఆర్థికపరమైన సమస్యలను అధిగమిస్తూనే మరోవైపు జిల్లా ప్రజల చిరకాల కోరికను నెరవేర్చడంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది.



ఏలూరు డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న మెడికల్ కాలేజీ భవన నిర్మాణ పనులు

- రూ.38 కోట్ల వ్యయంతో యుద్ధప్రాతిపదికన పనులు
- ఏలూరు ఆస్పత్రిలోనూ ఆధునిక వైద్యసేవలకు చర్యలు
- ఎంసీహెచ్ బ్లాక్‌పై ప్రత్యేక వార్డులు, చికిత్సలకు ఏర్పాట్లు
- బోధనాసుపత్రి, వైద్యవిద్యార్థులకు హాస్టల్ భవనాల నిర్మాణం

ఏలూరు టౌన్: ఏలూరు పాతబస్టాండ్ సమీపంలోని వైద్య ఆరోగ్య శాఖ జిల్లా కార్యాలయ ప్రాంగణంలో భారీ ఎత్తున మెడికల్ కాలేజీ భవన నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. జూలై, ఆగస్టు నాటికే భవన నిర్మాణాలు పూర్తి చేస్తూ ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి తరగతులు ప్రారంభించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆధునిక పరిజ్ఞానంతో భవనాలను నిర్మించేలా చర్యలు చేపట్టారు. మెడికల్ కాలేజీ కోసం ప్రభుత్వం రూ.525 కోట్లు గ్రాంట్ కేటాయించేలా ప్రణాళికలు రూపొందించగా, తాజాగా భవన నిర్మాణానికి, బోధనాసుపత్రిలో ఆధునీకీకరణ, ప్రత్యేక వార్డుల ఏర్పాటుకు సుమారుగా రూ.38 కోట్లు నిధులు మంజూరు చేసింది. దశల వారీగా పనుల ప్రగతి ఆధారంగా ప్రభుత్వం నిధులను విడుదల చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే బోధనాసుపత్రి నిర్మాణానికి రూ.5 కోట్లు నిధులు వెచ్చించారు. అలాగే ఆధునిక వైద్య చికిత్సకు పరికరాల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

సర్వజన ఆసుపత్రిలోనూ ప్రత్యేక వార్డులు

ఏలూరు మెడికల్ కళాశాలకు అనుసంధానంగా సర్వజన ఆసుపత్రిని ప్రభుత్వం ఆధునీకరణ చేస్తోంది. ఇప్పటికే ప్రత్యేక వార్డులను ఏర్పాటు చేస్తూ నూతన శోభను సంతరించుకునేలా తీర్చిదిద్దుతున్నారు. ఇక ఎంసీహెచ్ బ్లాక్‌పైన రెండు అంతస్తులను నిర్మిస్తూ వాటిలో ఆధునిక ప్రత్యేక చికిత్సలను అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టారు. (పీఐసీయూ) పిడియాట్రిక్ ఇంటెన్సివ్‌కేర్ యూనిట్, పుట్టిన నాటి నుంచి 24 రోజుల లోపు చిన్నారుల కోసం (ఎన్ఐసీయూ) నియో నేటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్, పుట్టిన వెంటనే అనారోగ్యంతో బాధపడే చిన్నారుల కోసం ప్రత్యేకంగా (ఎస్‌బీసీయూ) న్యూబోర్న్ బేబీ కేర్ యూనిట్, ఇక ప్రత్యేకంగా మెటర్నిటీ ఐసీయూ, గర్భిణులకు తీవ్ర అనారోగ్య సమస్యల చికిత్సకు ప్రత్యేక ఐసీయూ ఏర్పాటుకు నిర్మాణాలు చేపడుతున్నారు. సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో మెడికల్ స్టోర్స్ ఎదురుగా ఉన్న ప్రాంతంలో వైద్య విద్యార్థులకు హాస్టల్ నిర్మాణాలు, బోధనాసుపత్రి నిర్మాణాలు సైతం వేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టు సంస్థ హాస్పిటల్‌లో ఉంటూ నిత్యం పనులను పర్యవేక్షిస్తున్నారు.

మెడికల్ కౌన్సిల్ నిబంధనల మేరకు ఏర్పాట్లు



ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణంతోపాటు, బోధనాసుపత్రిలో రోగులకు సకల సౌకర్యాలు, ఆధునిక వైద్యసేవలను అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ విద్యాసంవత్సరం నుంచే వైద్య 150 సీట్లతో వైద్య విద్య తరగతులు ప్రారంభించేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళుతున్నాం. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రెండు, మూడు నెలల్లో తనిఖీలకు వచ్చే నాటికే నిబంధనలకు అనుగుణంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. రాబోయే కాలంలో సర్వజన ఆసుపత్రిలోనూ రోగులకు ఆధునిక వైద్య చికిత్సలు అందుబాటులోకి వస్తాయి.

– డాక్టర్ కేవీవీ విజయ్‌కుమార్, బోధనాసుపత్రి సూపరింటెండెంట్



సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో బోధనాసుపత్రి, హాస్టల్ భవనాలు నిర్మిస్తున్న దృశ్యం



ఎంసీహెచ్ బ్లాక్ పైభాగంలో నిర్మిస్తున్న ప్రత్యేక వార్డులు

27న ఆర్టీసీ స్థలాల లీజుపై అవగాహన సదస్సు

భీమవరం (ప్రకాశం చౌక్): ప్రజా రవాణా శాఖ పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోని ఖాళీ స్థలాలను లీజుకు ఇచ్చేందుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.వీరయ్య చౌదరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థలాల లీజుకు ఇవ్వడంపై ఈ నెల 27న శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు భీమవరంలోని ప్రజా రవాణా శాఖ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో నరసాపురం డిపో పరిధిలోని మార్టేరు బస్‌స్టేషన్ ప్రాంగణంలో ఖాళీ స్థలం, తాడేపల్లిగూడెం బస్ స్టేషన్ ప్రాంగణం వద్ద ఖాళీ స్థలం , భీమవరం ఆర్టీసీ గ్యారేజీ పక్కన ఖాళీ స్థలం ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

హాస్టల్ విద్యార్థి ఆత్మహత్యతో కలకలం

ముదినేపల్లి రూరల్: స్థానిక బీసీ హాస్టల్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన విద్యార్థుల్లో కలకలాన్ని రేపింది. వివరాలిలా ఉన్నాయి. కృష్ణా జిల్లా పెదపారుపూడి మండలం కొర్నిపాడుకు చెందిన మాచర్ల తేజేష్‌కుమార్ (15) స్థానిక బీసీ హాస్టల్లో ఉంటూ ముదినేపల్లి జెడ్పీ హైస్కూల్లో పదో తరగతి చదువుతున్నాడు. సంక్రాంతి సెలవులకు ఇంటికి వెళ్లి సోమవారం సాయంత్రం హాస్టల్‌కు వచ్చాడు. మంగళవారం ఉదయం పాఠశాలకు అని చెప్పి పెదపారుపూడి మండలం దోసపాడు వద్ద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. తేజేష్‌కుమార్ మూడో తరగతి నుంచి ఇదే హాస్టల్‌లో ఉంటూ ఎంతో క్రమశిక్షణతో చదివేవాడని, ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసిమెలిసి ఉండేవాడని అంటున్నారు. అయితే ఆత్మహత్య చేసుకోవడానికి కారణాలేమిటో అంతుపట్టడం లేదని విద్యార్థులు చెబుతున్నారు. తేజేష్ మృతికి సంతాప సూచికంగా పదో తరగతి విద్యార్థులకు మంగళవారం సెలవు ప్రకటించారు.

22.57 కేజీల గంజాయి స్వాధీనం

- దొంగరావిపాలెం వద్ద ముగ్గురి అరెస్టు
- జిల్లా ఎస్పీ రవిప్రకాష్ వెల్లడి



పెనుగొండలో కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రవిప్రకాష్

పెనుగొండ: దొంగరావిపాలెంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురు యువకులను అరెస్ట్ చేసి, వారి నుంచి 22.570 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ యూ రవిప్రకాష్ చెప్పారు. పెనుగొండ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను ఎస్పీ వెల్లడించారు. గంజాయిపై సమాచారం అందడంతో సీఐ జీవీవీ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్సై ఎస్ఎన్‌వీవీ రమేష్ దొంగరావిపాలెం పోలీసు అవుట్‌పోస్టు వద్ద ముగ్గురు వ్యక్తులు పోలీసులను చూసి మైకా సంచులతో పారిపోవడానికి ప్రయత్నించడంతో వారిని పట్టుకుని పెనుగొండ తహసీల్దార్ జి.గురుమూర్తిరెడ్డి, వీఆర్‌ఓ, వీఆర్ఏల సమక్షంలో తనిఖీలు చేశారన్నారు. మూడు మైకా సంచుల్లో రూ.2,25,700 విలువ గల 12 గంజాయి ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించారన్నారు. తూర్పుగోదావరి జిల్లా చాగల్లుకు చెందిన పాతూరి శివరాజు, పాటూరి అజయ్, పెనుగొండ మండలం చెరకువాడకు చెందిన యడ్లపల్లి అభిషేక్ వీరాస్వామి అనే యువకులను అదుపులోకి తీసుకుని విచారణ చేయగా, అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరుకు చెందిన మణికంఠ వద్ద నుంచి రూ.50 వేలుకు గంజాయిని కొనుగోలు చేసి పెనుగొండ పరిసర ప్రాంతాల్లో అధిక ధరకు అమ్మడానికి తీసుకుని వచ్చినట్లు తేలిందన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి తణుకు కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్పీ చెప్పారు. గంజాయి వినియోగం , అమ్మకం, రవాణాలపై గట్టి నిఘా పెట్టామని, అనుమానం ఉన్న ప్రాంతాల్లో నిత్యం తనిఖీలు చేస్తున్నామన్నారు. సమావేశంలో డీఎస్పీ కే రవిమనోహరచారి, పెనుగొండ సీఐ, ఎస్సైలతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



భీమవరం అర్బన్ : యనమదుర్రు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తున్న భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



పాలకొల్లు అర్బన్ : ఉల్లంపర్రు పంచాయతీ పార్వతీనగర్‌లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్

బాధితులకు సత్వర న్యాయం అందించాలి



జగన్నాథరెడ్డికి నియామక పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు (టూటౌన్): బాధితులకు సత్వర న్యాయం అందించటానికి ఏపీపీలు, ప్రభుత్వ ప్లీడర్లు కృషి చేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే ఆళ్ల నాని కోరారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పీడీజే కోర్టు ప్రభుత్వ న్యాయవాదిగా నియమితులైన బి.జగన్నాథరెడ్డికి ఆయన తన క్యాంపు కార్యాలయంలో బుధవారం నియామక పత్రాన్ని అందించారు. అదేవిధంగా ఇటీవల సీఐడీ స్పెషల్ పీపీగా నియమితులైన మాండ్రు రాజేంద్ర ఎమ్మెల్యే నానిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ కోర్టుల్లో ప్రభుత్వం తరుపున నియమించే ఏపీపీలు, జీపీ, ఏజీపీ పోస్టుల్లో ఎనభై శాతం బడుగు, బలహీన వర్గాలకు చెందిన న్యాయవాదులకే అవకాశం కల్పించినట్లు చెప్పారు. ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా ఏపీపీలు, ప్రభుత్వ న్యాయవాదులు పనిచేయాలని కోరారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన పీపీ మాండ్రు రాజేంద్ర, ప్రభుత్వ న్యాయవాది బి.జగన్నాథరెడ్డిలు ఆళ్ల నానికి కృతజ్ఞతలు తెలియజేశారు. వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల రీజనల్ కో–ఆర్డినేటర్ డీవీ రామాంజనేయులు, ఏపీపీలు ఆచంట వెంకటేశ్వరరావు, టి.శశిధర్‌రెడ్డి, సీహెచ్ రాజేంద్రప్రసాద్, ఏజీపీ కేవీపీ మాధవరావు, బి.అచ్యుతరావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శ్రీకృష్ణ తులాభారం నాటకం

భీమవరం (ప్రకాశం చౌక్): శ్రీమావుళ్లమ్మ అమ్మవారి 59 వార్షికోత్సవ మహోత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన పలు కళాప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. వెంకి ఆర్కెస్ట్రా భీమవరం వారి సినీ మ్యూజికల్ నైట్, రాత్రి 8 గంటలకు రాజాజయ సుందరరాజు నాగిడిపాలెం వారిచే ప్రదర్శించిన సత్య హరిశ్చంద్ర నాటకం , రాత్రి 9 గంటలకు శ్రీమావుళ్ళమ్మ నాట్యమండలి వారిచే ప్రదర్శించిన శ్రీకృష్ణ తులాభారం నాటకం అలరించాయి. పెద్ద సంఖ్యలో ప్రజలు వీటిని తిలకించారు. ఈ కార్యక్రమంలో నీరుల్లికూరగాయ పండ్లు వర్తక సంఘం, అమ్మవారి ఉత్సవ కమిటీ సభ్యులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

నేడు నటి ఆమనికి సన్మానం

ఉత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం 5 గంటలకు శ్రీసీతాకల్యాణం హరికథ, రాత్రి 7 గంటలకు సినీ నటి ఆమనికి సువర్ణ కంఠాభరణంతో ఘన సన్మానం, రాత్రి 8 గంటలకు మూడు రత్నములు నాటకం కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ప్లాస్టిక్ వినియోగంపై ముగిసిన గడువు

- పర్యావరణానికి ప్రమాదకరంగా సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్
- నేటి నుంచి అమలులోకి ఫ్లెక్స్ ప్రింటింగ్‌పై నిషేధం
- ప్రత్యామ్నాయ వనరులపై యజమానుల దృష్టి



భీమవరంలో ఫ్లెక్స్ ప్రింటింగ్ మెషీన్

సాక్షి, భీమవరం: పర్యావరణానికి ప్రమాదకారిగా మారిన ఫ్లెక్స్ ప్రింటింగ్‌కు కాలం చెల్లింది. ఈ నెల 26వ తేదీతో ఫ్లెక్స్ ప్రింటింగ్, వినియోగాన్ని నిషేధిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం శుక్రవారం నుంచి అమలులోనికి రానుంది. దీంతో ఫ్లెక్స్ ప్రింటింగ్ యజమానులు ప్రత్యామ్నాయాలపై దృష్టి సారిస్తున్నారు. ప్లాస్టిక్ పర్యావరణానికి హాని చేస్తుండటమే కాక సమస్త జీవరాశుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఒకసారి మాత్రమే వినియోగించే ప్లాస్టిక్ వస్తువులతో కలిగే అనర్థాలపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతోంది. గతంలో అనేక పర్యాయాలు ప్లాస్టిక్‌పై నిషేధం అంటూ ప్రభుత్వాలు ప్రకటించినా ఆచరణలో మాత్రం శ్రద్ధ చూపలేదు. అయితే ఇటీవల దేశవ్యాప్తంగా ప్లాస్టిక్ నిషేధిస్తున్నామంటూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించడంతో రాష్ట్ర ప్రభుత్వం దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టింది. దీనిలో భాగంగానే సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలంటూ మునిసిపల్, పంచాయతీరాజ్ శాఖలకు ఉత్తర్వులిచ్చింది. దీనిపై మునిసిపల్, పంచాయతీరాజ్‌శాఖలు గత ఏడాది అక్టోబర్ నుంచి అమలు చేసేందుకు కసరత్తు ప్రారంభించాయి. దీనిలో భాగంగా ఫ్లెక్సీ ప్రింటింగ్ యజమానులకు, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాయి. అయితే తక్షణ నిషేధం వల్ల తాము ఇబ్బందులు పడతామంటూ ప్రింటింగ్ యజమానులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సమస్యను విన్నవించుకోవడంతో మూడు నెలలపాటు వెసులుబాటు కల్పించారు. వారికిచ్చిన గడువు గురువారంతో ముగియనుండడంతో నిషేధాన్ని కఠినంగా అమలు చేసేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు.

జిల్లాలో 260 ఫ్లెక్స్ ప్రింటింగ్ యూనిట్లు

జిల్లా వ్యాప్తంగా సుమారు 260 ఫ్లెక్స్ ప్రింటింగ్ యూనిట్లు ఉన్నాయి. వీటిపై ఆధారపడి సుమారు 3 వేల మంది జీవిస్తున్నారు. గత కొన్నేళ్లుగా బ్యానర్లు, హోర్డింగ్స్ ఎక్కువగా వినియోగిస్తున్నారు. వీటితోపాటు 120 మైక్రాన్ల కవర్లు, థర్మోకోల్ కప్పులు, ప్లేట్లు, ప్లాస్టిక్ చెంచాలు, కర్రీపాయింట్లలో ఆహార పదార్థాలు ప్యాకింగ్ చేసే కవర్లు వంటి వాటిని వినియోగించకుండా చర్యలు చేపట్టనున్నారు. ప్రధానంగా ఫ్లెక్స్ ప్రింటింగ్ వల్ల ఎక్కువగా నష్టం ఏర్పడుతుందని గుర్తించడంతో వీటిపై కొరడా ఝుళిపించనున్నారు. జిల్లా కేంద్రమైన ఒక్క భీమవరం పట్టణంలోనే 16 ఫ్లెక్స్ ప్రింటింగ్ యూనిట్లు ఉండగా పాలకొల్లు, నరసాపురం, ఆకివీడు, తణుకు, తాడేపల్లిగూడెం పట్టణాలతో పాటు మండల కేంద్రాలు, మేజర్ పంచాయతీల్లో సైతం ఫ్లెక్స్ ప్రింటింగ్ యూనిట్లు ఉన్నాయి. ఫ్లెక్స్ వినియోగం నిషేధాన్ని పటిష్టంగా అమలుచేయనున్న నేపథ్యంలో యూనిట్ల యజమానులు ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టారు. క్లాత్ బ్యానర్లు వినియోగించాలంటే ప్రింటింగ్‌కు సుమారు రూ.40 లక్షల వ్యయంతో మిషనరీ కొనుగోలు చేయాల్సి ఉంటుందని ప్రభుత్వం సబ్సిడీపై రుణాలు ఇప్పిస్తే తమకు ఉపాధి కలుగుతుందని యజమానులు చెబుతున్నారు.

ఇకపై ప్లాస్టిక్ వినియోగిస్తే కఠిన చర్యలు

జిల్లాలో ఫ్లెక్సీల ప్రింటింగ్, ప్లాస్టిక్ వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఈనెల 26వ తేది వరకు ప్రభుత్వం గడువు ఇచ్చింది. తరువాత ఎక్కడైనా ఫ్లెక్స్ ప్రింటింగ్ చేసినా, వినియోగించినా చర్యలు తప్పవు. అలాగే నిషేధిత ప్లాస్టిక్ ఉపయోగిస్తే ఉపేక్షించేది లేదు.

– దాసి రాజు, ఇన్‌చార్జి డీఆర్వో, భీమవరం

వైభవంగా శోభనాచలుని శాంతి కల్యాణం



శాంతి కల్యాణ మహోత్సవాన్ని జరిపిస్తున్న అర్చకులు

ఆగిరిపల్లి : స్థానిక శోభనాచల వ్యాఘ్రలక్ష్మీ నరసింహస్వామి మాఘమాస రథసప్తమి ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారు గజ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 10 గంటలకు స్వామివారి కల్యాణ మండపంలో (పెద్ద కొఠాయి) శాంతి కల్యాణాన్ని గ్రామానికి చెందిన రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. రాత్రి 7 గంటలకు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్వామివారిని పెళ్లికుమారుడిగా అలంకరించి గజ వాహనంపై గ్రామోత్సవం జరిపించారు. అనంతరం స్వామివారి కల్యాణ మండపంలో నిత్యకల్యాణ మహోత్సవాన్ని ఆలయ అర్చకులు వేదాంతం శేషుబాబు, అనంతకృష్ణ, ఇతర వేద పండితుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ ఈవో ఎన్.భవాని పర్యవేక్షించారు.

కేంద్ర పురస్కారంతో మరింత బాధ్యత



కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న వినయ్‌రామ్

కొయ్యలగూడెం: ఉపరితల రవాణా శాఖ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి చేతుల మీదుగా పురస్కారం అందుకోవటంతో తన బాధ్యతను మరింత పెంచిందని కొయ్యలగూడెంకు చెందిన నిడదవోలు వినయ్‌రామ్ అన్నారు. మోస్ట్ ఇన్‌స్పైరింగ్ గ్రీన్ ఎంట్రిప్రెన్యూర్ రంగంలో విశేష సేవలు అందించినందుకు కేంద్రం ప్రభుత్వ పురస్కారానికి ఎంపికయ్యాయని, ఈ మేరకు బుధవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి చేతులమీదుగా పురస్కారం అందుకున్నట్లు వినయ్ రామ్ స్థానిక విలేకరులకు తెలిపారు. తన ప్రాజెక్టు విధానాలపై కేంద్ర మంత్రి ఆరా తీశారని, ప్రస్తుతానికి రెండు తెలుగు రాష్ట్రాలలో అమలు చేస్తున్న ఈ విధానాలను ఆయనకు వివరించినట్లు తెలిపారు. త్వరలోనే ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మధ్యప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలలో ప్రాజెక్టులకు రూపకల్పన చేయాలని, కేంద్రం తరఫున సహకారం అందజేస్తామని మంత్రి పేర్కొన్నట్లు వినయ్ తెలిపారు.

పెండింగ్ కేసుల విచారణ వేగిరపర్చండి

- ఏలూరు జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ ఆదేశం
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పోలీసు అధికారులతో సమీక్ష



ఏలూరు టౌన్ : పోలీస్‌స్టేషన్లలో పెండింగ్ కేసుల్లో విచారణను వేగవంతం చేయాలని జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ పోలీసు అధికారులను ఆదేశించారు. ఏలూరులోని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని తన చాంబర్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పోలీసు అధికారులతో వివిధ అంశాలపై ఎస్పీ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసుల్లో సాక్షులు, నిందితులను కోర్టులో హాజరుపరిచి బాధితులకు సత్వరమే న్యాయం అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకుంటూ బాధితులకు న్యాయం చేస్తూ కేసులను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. రహదారి ప్రమాదాల నివారణకు తరచుగా విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగినా, మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్‌బీ సీఐ వి.రవికుమార్, డీసీఆర్‌బీ ఎస్సై సాధిక్, ఏలూరు, జంగారెడ్డిగూడెం, పోలవరం, నూజివీడు సబ్‌డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్సైలు ఉన్నారు.

పోలీస్ మెడల్‌కు చేబ్రోలు ఏఎస్సై ఎంపిక



కె.సాంబశివరావు, ఏఎస్సై, చేబ్రోలు

ఏలూరు టౌన్: చేబ్రోలు పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా పనిచేస్తున్న కడియాల సాంబశివరావు ప్రతిష్టాత్మక పోలీసు మెడల్‌కు ఎంపికయ్యారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా పోలీసు శాఖలో విధుల్లో ఉత్తమ సేవలందించిన వారికి కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డులు ప్రకటించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ పోలీస్ మెడల్ ఏలూరు జిల్లాకు చెందిన సాంబశివరావుకు దక్కింది. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ మెరిటోరియస్ సర్వీసు అవార్డు దక్కటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. సేవలు గుర్తించి కేంద్ర ప్రభుత్వానికి తన పేరు సిఫార్సు చేసిన డీజీపీ, ఐజీ, ఎస్పీలకు ఈ సందర్భంగా సాంబశివరావు కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

ఆకుతీగపాడులో పొలంబడి



రైతులకు సూచనలు చేస్తున్న ఏడీఏ మురళీకృష్ణ, వ్యవసాయాధికారులు

పెంటపాడు: మండలంలోని ఆకుతీగపాడు గ్రామంలో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గూడెం వ్యవసాయశాఖ ఏడీఏ పి. మురళీకృష్ణ, ఏవో సారథిల ఆధ్వర్యంలో సేంద్రియ వ్యవసాయం చేసుకోవాలని, మిత్రపురుగులను రక్షించుకొంటూ పంటకు హానీ చేసే తెగుళ్లను నిర్మూలించుకోవాలన్నారు. పెంటపాడు మండలంలో క్లస్టర్ గ్రామంగా ఉన్న ఆకుతీగపాడు రైతులు శాస్త్రవేత్తల సూచనలు, వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తూ తక్కువ ఖర్చుతో అధికది గుబడులు ఎలా సాధించాలనే విషయంపై ఆశక్తిని పెంచుకొని పలువురికి అవగాహన కలిప్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, సర్పంచ్ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యులు కొణతాల వెంకట్రావు, వ్యవసాయశాఖ వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

ప్రతి పథకం పేదలకు చేరాలి

పెంటపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజలకు అందిస్తున్న ప్రతి పథకం ప్రజలకు తెలియజేయాలని గృహ సారథులను ఎంపీపీ దాసరి హైమావతి కోరారు. పెంటపాడు పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ వలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి, నూతనంగా నియమితులైన గృహసారథులకు ప్రత్యేక సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పథకాలు ప్రజలకు వివరించి చెప్పి అర్హులైన వారి నుంచి వినతులు స్వీకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఏఎంసీ వైస్ చైర్మన్ జామి కృష్ణ, ఉపసర్పంచ్ ప్రసాద్‌రెడ్డి, వ్యవసాయ మండలి డైరెక్టర్ విజయానందరెడ్డి, ఎస్సీ నాయకులు దేవాబత్తుల బాబి, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, యూత్ అధ్యక్షులు కొవ్వూరి విజయభాస్కరరెడ్డి, చదలవాడ శ్రీనివాస్, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు కొలుపూరి శివకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

దేవతామూర్తులకు విశేష పూజలు



శ్రీఉమాసిద్దేశ్వరస్వామివారి ఆలయంలో దేవతా మూర్తులకు పూజాధికాలను నిర్వహిస్తున్న దృశ్యం

అత్తిలి: స్థానిక శ్రీఉమాసిద్దేశ్వరస్వామివారి ఆలయంలో నూతనంగా నిర్మించిన సూర్యాలయం, సుబ్రహ్మణ్యేశ్వరస్వామిఆలయం, నవగ్రహమండపం, చండీశ్వరాలయంలో ప్రతిష్ఠించే దేవతామూర్తులకు బుధవారం విశేష పూజలు నిర్వహించారు. పంచగవ్యారాధన, పాలాభిషేకం, వాస్తుహోమం, గ్రామప్రదక్షిణ, జలాదివాసం, ధాన్యాదివాసం, పుష్పాదివాసం ఫలాదివాసం హోమ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఐలూరి రాజశేఖరశర్మ పర్యవేక్షణలో పూజాధికాలను జరిపారు. గురువారం ఉదయం విగ్రహ ప్రతిష్ఠాపన జరుగుతుంది. ఆలయ కమిటీ చైర్మన్ బండి అంజన్న, కమిటీ సభ్యులు, భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

11న జాతీయ లోక్ అదాలత్

పాలకోడేరు: ఫిబ్రవరి 11న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌పై గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాన్ని ప్యానల్ లాయర్ బి.లోకేశ్వరరావు అధ్యక్షతన విస్సాకోడేరు గ్రామ సచివాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేశ్వరరావు మాట్లాడుతూ వచ్చే నెల 11న రాష్ట్ర జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఆదేశాల మేరకు జాతీయ లోక్ అదాలత్‌ను భీమవరంలోని అన్ని కోర్టు సముదాయాల్లో నిర్వహిస్తున్నామన్నారు. రాజీ పడతగిన క్రిమినల్ కేసుల్లో ఉన్న, సివిల్ కేసులో చెక్ బౌన్స్ కేసుల్లో ఉన్న కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వీరవాసరం పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

వీరవాసరం: ప్రజల ఆరోగ్యం కోసం సిబ్బంది ప్రత్యేక సిబ్బంది కనబరచాలని డిఎంఅండ్‌హెచ్‌వో డా.డి మహేశ్వరరావు అన్నారు. వీరవాసరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా వ్యాప్తంగా కంటి వెలుగు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తి మృతి

పాలకోడేరు: ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటనలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందిన సంఘటన ఇది. అమలాపురం డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సు ముందు సైకిల్‌పై వెళ్తున్న నందం అప్పారావు (తాపీ మేస్త్రి)ను ఈ నెల 18న శృంగవృక్షం హైస్కూల్ వద్ద ఢీకొనడంతో తలకు తీవ్రంగా గాయమైంది. అప్పటి నుంచి భీమవరం ప్రైవేటు ఆస్పత్రిలో కోమాలో ఉన్నాడు. చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచాడు. కుమారుడు సుబ్రహ్మణ్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓటు హక్కును ప్రతి పౌరుడు గుర్తించాలి

తణుకు టౌన్: భారత రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కుపై విద్యార్థులు అవగాహనతో మెలగాలని తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ చెప్పారు. బుధవారం తణుకు తహసీల్దార్ కార్యాలయం వద్ద జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. ఈకార్యక్రమంలో ఓటు హక్కుకు సంబందించిన వివిధ అంశాలను, ఓటు హక్కు పొందడానికి అవసరమైన అర్హతలను, ఓటు హక్కు దరఖాస్తుల వివరాలను వివరించారు. సీనియర్ ఓటర్లను సత్కరించి, కొత్తగా ఓటు హక్కు పొందిన వారికి ఓటు గుర్తింపు కార్డులను అందజేశారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో టీఎస్ మూర్తి, డీటీలు, ఆర్ఐలు, వీఆర్వోలు, ఇతర రెవిన్యూ సిబ్బంది, వివిధ కళాశాలల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా కళాశాల విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో...

జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా తణుకులోని ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలో విద్యార్థినీలు కళాశాల రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఓటరు దినోత్సవ ఆవశ్యకతను వివరించే విధంగా ముగ్గులతో కళాశాల ఆవరణలో రంగు రంగుల ముగ్గులు వేశారు. ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ, పరుగు పందెం, షార్ట్‌పుట్, త్రోబాల్, షటిల్ బాల్ పోటీలను నిర్వహించి విజేతలకు గణతంత్ర దినోత్సవం రోజు బహుమతులు అందజేస్తామని ప్రిన్సిపాల్ డా.ఎస్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈకార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం కృష్ణ సాయి, ఇతర అధ్యాపక సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న తహసీల్దార్ శేషగిరిరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. శ్యాంబాబు, తదితరులు



జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముగ్గుల పోటీల దృశ్యం



జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా 14వ వార్డులో సీనియర్ సిటిజన్స్‌కు సత్కరిస్తున్న దృశ్యం

ఘనంగా జాతీయ ఓటు హక్కు దినోత్సవం

తాడేపల్లిగూడెం (టీఓసీ): జాతీయ ఓటు హక్కు దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక 14వ వార్డులో సీనియర్ సిటిజన్స్‌కు సన్మాన కార్యక్రమాలు జరిగాయి. ఓటర్ దినోత్సవం సందర్భంగా పిల్లలతో ముగ్గుల పోటీలు నిర్వహించి ఓటు హక్కు వినియోగించుకోవడం వల్ల ఉపయోగాలు తెలిపారు. వార్డు ఇన్‌ఛార్జిలు మిద్దే ఆదినారాయణ, నీరుకొండ పండు, వెల్ఫేర్ సెక్రటరీ కృష్ణవేణిలు పర్యవేక్షించారు.

పట్టణంలోని 34వ వార్డులో వాటర్ దినోత్సవం సందర్భంగా బుధవారం విశ్రాంత ఉపాధ్యాయులు పంచికర్ల చలపతిరావును సత్కరించారు. ఓటర్ దినోత్సవ ప్రతిజ్ఞను నిర్వహించారు. ప్రతి ఒక్కరు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి వట్టి సోమేశ్వరరావు (బుజ్జి), వీఆర్‌ఓ శ్రీనివాస్, అడ్మిన్‌లు లక్ష్మి, రంగనాథ్, సెక్రటరీలు, వలంటీర్స్ పాల్గొన్నారు.

ఓటుహక్కు ప్రాముఖ్యతను గుర్తించాలి

పెంటపాడు: ఓటుహక్కు ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ గుర్తెరగాలని డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాఎం. శ్యాంబాబు, తహసీల్దార్ జీవీ శేషగిరిరావులు కోరారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా బుధవారం మండలంలో పలు గ్రామాల్లో ఓటర్ల దినోత్సవ కార్యక్రమాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాజనీతి విభాగం, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. శ్యాంబాబు, తహసీల్దార్ జీవీ శేషగిరిరావులు మాట్లాడుతూ వజ్రాయుధం లాంటి ఓటుహక్కు బాధ్యతను ప్రతీ పౌరుడు గుర్తించాలన్నారు. ఓటును అమ్ముకోకుండా సమర్థుడైన అభ్యర్థికి ఓటు వేయాలన్నారు. ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థులకు ఇటీవల నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం తదితర పోటీలలో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్ సీపీ కార్యదర్శి నల్లమిల్లి విజయానందరెడ్డి, కళాశాల రాజనీతి విభాగాధిపతి జాన్ బాబు, గ్రామ ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, వార్డు సభ్యులు వెలగల శ్రీనివాసరెడ్డి, ఎంఈవో ఎం. శ్రీనివాస్, పార్టీ నాయకులు తాడేపల్లి ఈశ్వరరావు, ఎస్సీ నాయకులు దేవాబత్తుల బాబి, కళాశాల అధ్యాపకులు, బూత్‌లెవిల్ అధికారులు, పలు గ్రామాల వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శి అనిల్‌కుమార్, ఆర్ఐ కనకదుర్గ, పంచాయతీ విస్తరణాధికారి ప్రసాద్ సచివాలయ సిబ్బంది, కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సౌత్ జోన్ హ్యాండ్‌బాల్ పోటీలలో తణుకు విద్యార్థిని ప్రతిభ



సౌత్ జోన్ హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థినిని అభినందిస్తున్న మహిళా కళాశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ తదితరులు

తణుకు టౌన్: కాకినాడలోని ఐడిల్ కళాశాలలో ఈనెల 23, 24 తేదీల్లో జరిగిన ఆది కవి నన్నయ్య యూనివర్సిటీ ఇంటర్ కాలేజీయేట్ యూనివర్సిటీ హ్యాండ్ బాల్ పోటీల్లో తణుకు ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాలకు చెందిన విద్యార్థినీ రమ్య సౌత్ జోన్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కరుటూరి రామకృష్ణ తెలిపారు. కొట్టైలోని మహత్మా గాంధీ యూనివర్సిటీలో సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ హ్యాండ్ బాల్ పోటీల్లో ఆది కవి నన్నయ్య యూనివర్సిటీ తరపున పాల్గొనేందుకు ఎంపికైనట్లు తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థినీ, రమ్యను కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి, జాయింట్ సెక్రటరీ వెంకట కృష్ణారావు, ఏవో డా.డీ సుబ్బారావు, వైస్ ప్రిన్సిపాల్ యూ లక్ష్మీసుందరిబాయి, పీడీ ఎం రత్నకుమారి, ఇతర అధ్యాపక సిబ్బంది అభినందించారు.

నేడు మాధవరంలో ఉచిత వైద్య శిబిరం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మాధవరం గ్రామంలో గురువారం ఉదయం 9 గంటలకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నవాబ్‌పాలెం సొసైటీ మాజీ చైర్మన్ వీఎస్‌వీ ఎస్.నారాయణ తెలిపారు. బ్యాంకు ఆఫ్ బరోడా ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెంకు చెందిన స్టార్ ఆసుపత్రి వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు చేస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

CHANGE OF NAME

I, Vuddaraju Appala Narasamma, W/o. Vuddaraju Murali Krishnam Raju, R/o. Door No.3-12, Behind Primary School, Kasipadu-534 196, Ganapavaram Mandal, W.G.Dist., AP do hereby inform to the public that my name Uddaraju Appala Narasamma (Old Name) has been changed as Vuddaraju Appala Narasamma (New Name) for all transactions.

CHANGE OF NAME

I, Vuddaraju Murali Krishnam Raju, S/o. Late Satyanarayana Raju, R/o. Door No.3-12, Behind Primary School, Kasipadu-534 196, Ganapavaram Mandal, W.G.Dist., AP do hereby inform to the public that my name Uddaraju Murali Krishnam Raju (Old Name) has been changed as Vuddaraju Murali Krishnam Raju (New Name) for all transactions.

వలంటీర్లు బేస్‌లైన్ సర్వే కచ్చితంగా పూర్తిచేయాలి



ఎస్‌డీజీపై సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రామారావు

అత్తిలి: వలంటీర్లు బేస్‌లైన్ సర్వే కచ్చితంగా పూర్తిచేయాలని ఎంపీడీవో వీవీవీఎస్ రామారావు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎస్‌డీజీపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో పూర్తి అవగాహనతో పనిచేయాలని, డేటా రూపొందించే సమయంలో వలంటీర్ బేస్ లైన్ సర్వే ఆధారంగా డేటా ఉండాలన్నారు. నవరత్నాలతో లింకై న ఇండికేటర్స్ డేటా ఎప్పటికప్పుడు నవీకరించాలన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో ముఖ్యంగా హెల్త్, ఫ్యామిలీవెల్ఫేర్, ఎడ్యుకేషన్, లా అండ్ ఆర్డర్ ఉన్నాయని, వీటి ద్వారా అమలు చేసే వివిధ పథకాలు పూర్తిస్థాయిలో అప్డేట్ చేయాలని సూచించారు. బడి ఈడు పిల్లలు రక్తహీనతకు గురికాకుండా ఎప్పటికప్పుడు పౌష్టికాహారం అందించడంతో పాటు సంబంధిత మందులను రోజుకు రెండుసార్లు అందజేసేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఈవోపీఆర్డీ ఎం శ్రీనివాసరావు, ఏఎస్ఓ ఎన్ శివకుమార్, గృహనిర్మాణశాఖ ఏఈ కె సత్యనారాయణమూర్తి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం శ్రీదేవి, సచివాలయ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా నూతన రామాలయం నిర్మాణ పనులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని పురాతనమైన మొట్టమొదటి రామాలయంగా ప్రసిద్ధికెక్కిన శ్రీ కోదండ రామ స్వామి వారికి నూతన దేవాలయం నిమిత్తం నిర్వహిస్తున్న పునఃనిర్మాణ (పునరుద్ధరణ) పనులు రామారావుపేటలో శరవేగంగా సాగుతున్నాయి. ఉపముఖ్యమంత్రి, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఒక కోటి రూపాయిలు నిధులు మంజూరు చేయించడంతో ఎండోమెంట్ సహకారంతో చలంచర్ల వారి వీధిలో శిథిలావస్థకు చేరిన రామాలయాన్ని పునఃనిర్మాణం చేస్తున్నారు. ఆలయ కమిటీ మేనేజింగ్ ట్రస్టీ ఎస్‌వీ రమణారావు, సెక్రటరీ ఎస్‌వీహెచ్‌వీఎస్ శేషావతారం, కోశాధికారి జి.నాగేంద్రనాథ్ పర్యవేక్షణలో నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.



శరవేగంగా సాగుతున్న రామాలయం నిర్మాణ పనులు

ఆలయ నిర్మాణానికి మరో రూ.50 లక్షలు అవసరం



పురాతన కోదండ రామాలయం జీర్ణావస్థకు చేరింది. భక్తులు కోరిక మేరకు ఆలయాన్ని పునర్ధరిస్తున్నాం. ఆలయ నిర్మాణానికి మరో 50 లక్షలు వరకు అవసరం అవుతాయి. పట్టణ ప్రముఖులు, దాతలు మరింత మంది ముందుకు వచ్చి ఆలయ నిర్మాణం పూర్తిస్థాయిలో నిర్మించేందుకు కమిటీకి సహకరించాలి.

– ఆలయ కమిటీ మేనేజింగ్ ట్రస్టీ ఎస్‌వీ రమణారావు

పెంటపాడులో స్వచ్ఛ సంకల్పం



జగనన్న స్వచ్ఛసంకల్పం కార్యక్రమంలో భాగంగా రోడ్లు ఊడ్చుతున్న సర్పంచ్, ఇతర ప్రజాప్రతినిదులు

పెంటపాడు: ప్రజలు వ్యక్తిగత ఆరోగ్యం, ఇంటి శుభ్రతతో పాటు, పరిసరాల శుభ్రతకు కూడా అధిక ప్రాధాన్యత ఇవ్వాలని పెంటపాడు గ్రామ సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ పేర్కొన్నారు. పెంటపాడు గ్రామంలో జగనన్న స్వచ్ఛసంకల్పం, గణతంత్ర దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ ఆధ్వర్యంలో గ్రామ ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు రెండు వార్డులో స్వచ్ఛ సంకల్పం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించేందుకు పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వీధుల్లో చెత్త వేయకుండా రిక్షాలకు అందించి, డ్రైనేజీలు కలుషితం కాకుండా చూసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఉదయం 6 గంటల నుండి 7.30 గంటల వరకు పలు ప్రాంతాలలోని చెత్తను తొలగించి, రోడ్లు ఊడ్చారు. డ్రైయిన్‌లలో పూడిక తీసారు. తాగునీటిపై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, మండల వ్యవసాయకమిటీ డైరెక్టర్ నల్లమిల్లి విజయానందరెడ్డి, యూత్ అధ్యక్షులు కొవ్వూరి విజయబాస్కరరెడ్డి, ఎంపీటీ సీ సభ్యులు రెడ్డి సూరిబాబు, దేవాబత్తుల నాగమణి బాబి, వార్డు సభ్యురాలు విప్పర్తి లక్ష్మి, కాసారపు శ్రీను, చదలవాడ శ్రీనివాస్, కొలుపూరి శివ, దేవాబత్తుల వెంకన్నబాబు, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలి



వార్డులో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో 19,20 వార్డుల్లో బుధవారం వెక్టార్ కంట్రోల్ హైజీన్ అవగాహన కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ఇంటి పరిసర ప్రాంతాల్లో అపరిశుభ్రత వాతావరణం వల్ల వ్యాధులు ప్రబలుతాయని తెలిపారు. నీటి నిల్వ ఉండే ప్రాంతాల్లో పెరుగుతున్న లార్వాను గుర్తించి, వాటిని నిర్మూలించాలన్నారు. ప్రతి శుక్రవారం ప్రజలు డ్రై డే పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆరోగ్య కార్యదర్శి వెంకట లక్ష్మి, ఆరోగ్య సహాయకులు కాంతారావు, ఆరోగ్య, ఆషా, అంగన్‌వాడీ, శానిటేషన్ కార్యదర్శి సోని, సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

తాగునీటిని పొదుపుగా వాడాలి



జలజీవన్ మిషన్ అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

పెంటపాడు: దర్శిపర్రు గ్రామానికి జలజీవన్ మిషన్ ద్వారా అందిన రూ. 1.22 కోట్లు సద్వినియోగం చేసుకొని ప్రజలు తాగునీటిపై శ్రద్ధ వహించాలని దర్శిపర్రు సొసైటీ అధ్యక్షుడు, సీనియర్ వైసీపీ నాయకులు గుండుమోగుల సాంబయ్య కోరారు. దర్శిపర్రు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జలజీవన్‌మిషన్ టీం ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు తాగునీటిపై అవగాహన కలిప్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో 1506 కుటుంబాలకు 1078 ఇళ్లు ఉన్నాయన్నారు. సుమారు 3.7 వేలమీటర్లు మేర డిజిటల్ పైపులైన్లు వేసేందుకు మోటీరియల్ కూడా సిద్ధంగా ఉందన్నారు. జలజీవన్‌మిషన్‌లో కుళాయిలు వేసేందుకు పంచాయతీ కార్యదర్శి అనిల్‌కుమార్ అనుమతి ఇచ్చారన్నారు. గ్రామంలో తాగునీటిని పొదుపుగా వాడి భావితరాలకు జలాన్ని అందించాలన్నారు. నీటి వృధాను అరికట్టాలన్నారు. ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ చొరవతో గ్రామానికి ఇంత కాలానికి భారీగా నిధులు మంజూరు చేసినందుకు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పెంపుడు జంతువులకు టీకాలు

పాలకొల్లు సెంట్రల్: జంతు సంక్షేమం ఓ సామాజిక బాధ్యతని వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు తెలిపారు. బుధవారం స్థానిక పశువైద్య శాలలో జంతు సంక్షేమ పక్షోత్సవాల్లో భాగంగా కుక్కలకు రెబిస్ టీకాను ఉచితంగా వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రామశేఖర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జంతువులపట్ల దయ, ప్రేమ కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా పక్షోత్సవాల్లో భాగంగా 25 కుక్కలకు రెబిస్ టీకాను ఉచితంగా వేశారు. ఈ నెల 31వ తేది వరకూ జంతు సంక్షేమ పక్షోత్సవాలు జరగనున్నాయి. జంతు సంక్షేమ పక్షోత్సవాలు సందర్భంగా ఈ నెల 16 నుంచి 31వ తేదీ వరకు అన్ని పశువుల ఆసుపత్రుల వద్ద ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పాలకొల్లు ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాకులు డాక్టర్ మేడా రామశేఖర్ చెప్పారు.